

# Y3K

**21 డిసెంబర్ 1999**

నిరంజన్‌కి అవమానంగా వుంది... కోపంగా... బాధగా వుంది... రెండువేల సంవత్సరం దగ్గరపడుతున్న కొద్దీ టెన్షన్‌గా వుంది.

కోట్ల రూపాయల లెక్కలు గందరగోళమయ్యే సమస్య.... వై2కె సమస్య తన కంప్యూటర్లన్నిటినీ చావు దెబ్బ కొట్టబోతున్న సమస్య. ఇన్‌వాయిసింగ్, ప్రొడక్షన్ సిస్టమ్, డేటాబేస్, [illegible], పేరోల్ సిస్టమ్... ఒక్కటేమిటి... తన బిజినెస్‌తో ముడిపడ్డ లావాదేవీలన్నీ... కేవలం రెండే రెండు అంకెలతో... నాశనమయ్యే సమస్య... వై2కె.

ఎలా...? ఎలా...? ఎలా...?

మెర్సిడస్ కారుని పోర్టికోలో ఆపి రిమోట్‌తో డోర్‌లాక్‌చేసి ఇంట్లోకి వస్తూ... సెల్ ఫోన్ తీసి 'సొల్యూషన్ ఇంటిగ్రేటెడ్ మార్కెటింగ్ సర్వీసెస్'కి నంబర్‌లు నొక్కాడు.

అవతల ఓ ఆడకంఠం లైన్లోకి రాగానే దర్పంగా చెప్పాడు.

"అయాం నిరంజన్ కందుకూరి. ఛైర్మెన్ కమ్ ఎం.డి. మాన్వి ప్రాజెక్ట్. నా బిజినెస్ డీలింగ్స్ అన్నీ కూడా మా కంప్యూటర్స్‌లో ఫీడ్ చేయబడ్డాయి. నాకున్న పందొమ్మిది రకాల బిజినెస్‌లన్నింటికీ కలిపి దాదాపు తొంభైరెండు కంప్యూటర్లున్నాయి. వాటిల్లో కోట్ల రూపాయల టర్మ్స్ ఫీడ్ చేస్తాం. అలాగే వాటిల్లో హార్డ్‌వేర్, ఆపరేటింగ్ సిస్టమ్, సాఫ్ట్‌వేర్ ప్రోగ్రామ్, డేటా షేరింగ్... ఇలా అయిదు స్థాయిల్లో డేట్స్ అండ్ ఇయర్స్ కూడా నమోదు చేస్తాం... అలాంటప్పుడు ఈ వై2కె గురించి కొంచెం చెప్పండి ప్లీజ్"

నిరంజన్ వయసు యాభైమూడేళ్ళు. స్వర్గధామంలాంటి ఆ ఇంట్లో భార్య, ఇద్దరు కొడుకులు, కూతురు, పనిమనిషి ఎందరున్నా... అంతా నిశ్శబ్దమే...

ఒక్క గదిలోంచి మాత్రం... ఖళ్‌ఖళ్‌మని విన్పించే తండ్రి దగ్గు తప్ప.

అదికూడా అప్పుడప్పుడు కొడుకుల గదుల్లోంచి వచ్చే పాప్ మ్యూజిక్ ధాటికి కొట్టుకుపోతుంది. నిరంజన్ పనిమనిషిని పిలిచి గదిలో మ్యూజిక్ సౌండ్‌ని తగ్గించుకోమని చెప్పి" ఊ.... చెప్పండి" అన్నాడు.

"సర్... కంప్యూటర్ మైక్రోచిప్‌లలో సంవత్సరం నమోదు చేసేందుకు కంప్యూటర్ ప్రోగ్రాంలు రాసేవారు చివరి రెండు అంకెలు మాత్రమే ఉపయోగించే పద్ధతి ఎంచుకున్నారు. సపోజ్ 1999వ సంవత్సరాన్ని కేవలం '99'గా నమోదు చేస్తారు. ఇప్పటివరకు ఈ శతాబ్దంలో కంప్యూటర్ '00' రెండు సున్నాలను మాత్రమే చూపిస్తాయి. దీంతో కంప్యూటర్లు తమ లెక్కకు అందని పరిస్థితిని ఎదుర్కొంటాయి. తీవ్ర గందరగోళానికి గురవుతాయి. మొత్తం తప్పుడు సమాచారాన్ని అందిస్తాయి. అందుకే మీరు వై2కెని వీలైనంత త్వరగా క్లియర్ చేయించుకోండి. లేనట్లయితే మీ బిజినెస్ కోట్ల రూపాయుల లావాదేవీలు తారుమారై పెద్ద నష్టాన్ని ఎదుర్కొంటారు....'

ఆ మాటలు వినగానే నిరంజన్‌లో కొంచెం బి.పి. డౌన్ అయింది. చెమటలు పట్టాయి. సెల్ ఆఫ్‌చేసి 'మాళవికా... మంచినీళ్లు' అని అరచి సూటు జేబులోంచి టాబ్లెట్ తీసి/వేస్కున్నాడు.

ఐబ్రోస్‌లో వస్తున్న తెల్ల వెంట్రుకలకి బ్లాక్‌షేడ్ చేస్తున్న భార్య మాళవిక ఆ అరుపు విని నీళ్ల గ్లాసుతో పరుగున వచ్చింది. నీళ్లు గటగటా తాగిన నిరంజన్ అసహనంగా సోఫాలో తలపట్టుకు కూర్చున్నాడు.

"డాక్టర్ వచ్చారా?" అనడిగాడు.

"వచ్చారు. కాని ట్యుబర్క్యులోసిస్ ముదిరిపోయింది పర్మినెంట్‌గా ఇక

టి.బి. హాస్పిటల్‌లోనే వుంచటం బెటరన్నారు." మాళవిక చిరాగ్గా అంది.

అప్పుడే పైబెడ్‌రూంలోంచి వచ్చిన కూతురు... డైనింగ్ హాల్‌లోంచి వచ్చిన పెద్దకొడుకు "అసహ్యంగా డాడ్.. గ్రాండ్ ఫాదర్ దగ్గుతో డిస్టర్బ్ అవుతోంది. అందులోనూ మా ఫ్రెండ్స్ వస్తే అసహ్యంగానూ వుంటోంది" అన్నాడు.

నిరంజన్ వాళ్ళవైపు, మాళవిక వైపు నిర్లిప్తంగా చూసాడు.

ఏ బంధమో గుండెను సూదితో గుచ్చుతున్నంత బాధ....

"టి.బి. హాస్పిటల్ స్పెషల్ రూంలో వేసి అన్నీ సమకూర్చితే ఏం పోయింది? అన్నీ పెట్టేవాళ్ళుంటే... రోగాన్ని మించిన భోగం లేదన్నారు" మాళవిక మాటల్లో మమకారం చచ్చిన వెటకారం.

"డాడీ... ఇప్పటివరకూ మేమంతా వై2కె సమస్య గురించి డిస్కస్ చేస్తూ వుంటే... మధ్యలో ఈయన దగ్గొకటి.... ఎంత డిస్టర్బ్ అవుతుందో తెల్సా?" అంది కూతురు. అప్పుడే చెవులకి వాక్‌మెన్ తగిలించుకొని వూగుతూ వచ్చిన చిన్న కొడుకు "డాడీ... మనకి చాలా కంప్యూటర్లు వున్నాయి కదా. వై2కె ప్రాబ్లమ్‌ని ఎలా సాల్వ్ చేస్తారు" అన్నాడు వస్తూనే.

ఆ మాట విన్న పెద్దకొడుకు "డాడీ... ఇంతకు ముందే నేను దీనిని వారి వెబ్‌సైట్ గిగిగి.గి2దివీళిఖీ.రిదీ వద్ద ఇన్ఫర్మేషన్ తీసుక్కున్నాను. అలాగే ఇలిజిచీటు2చవీళిఖీ.రిదీ కి మెయిల్ చేసి కూడా కొంత..."

దగ్గు విపరీతంగా వినిపిస్తుండటంతో అతడు చిరాగ్గా ఆ గదివైపు చూసి విసుక్కోవటం ఆపాడు.

నిరంజన్ నిశ్శబ్దంగా లేచి గదివైపు వెళ్లాడు.

గదిలో... మంచంమీద బక్కచిక్కి... ఎనభై ఏళ్ల తండ్రి... దగ్గుతో మెలికల తిరిగి పోతున్నాడు. పక్కలో మూడపాయిన జున్నుముక్కగా.. నల్లటి రక్తం ముద్ద పడింది. జిగటలాంటి కఫం ఎండిపోయి చెంపలమీద పేరుకుపోయింది.

ఆ దృశ్యం చేసి... నిరంజన్ కళ్లల్లో నీళ్లు చిప్పిల్లాయి... గబుకున తండ్రిని ఒడిసిపట్టుకొని 'నాన్నా...' అన్నాడు బాధగా అతడి దగ్గు మరో అయిదు నిమిషాల వరకు ఆగలేదు. నిరంజన్ పక్కనే వున్న సిరప్ తాగించి... తండ్రి చాతిపై నిమిరాడు. చర్మంకింద ఎముకల తగిలాయి. గుండె లబ్‌డబ్ శబ్దం కన్నా గరగరా శబ్దాన్నే విన్పిస్తోంది. టవల్‌తో చెంపలకంటిన కఫాన్ని తుడిచాడు.

"నీరూ... నన్ను... నన్ను... టి.బి. హాస్పిటల్‌లో వేస్తావురా...?? ఆ వృద్ధుడు అడగలేదు. అతడి కళ్లల్లోంచి శూలాలై వస్తున్న ప్రశ్న కలవరపెడుతోంది.

నిరంజన్ తలొంచుకున్నాడు.

"డాక్టర్ చెప్పాడ్రా.. ఇక టి.బి. దవాఖానలోనే వుంచటం మంచిదని. మరి నన్నెప్పుడు పంపిస్తావురా..." ఆయాసంతో తండ్రి గుండెలోంచి వచ్చిన కన్నీటి మూట పగిలింది. నిరంజన్.

గుండె చిట్లిపోయేదే... వై2కె వైరస్ సడెన్‌గా గుర్తొచ్చి ఆలోచనలు మరలిపోయాయి.

"లేదు నాన్నా... ఎవ్వరికి ఇబ్బంది కాకుండా... నిన్ను వేరే గదిలోకి మారుస్తాను. నువ్వేం ఫీల్‌కావద్దు" అని లేచాడు. పనిమనిషిని, తోటమాలిని పిలిచి

ఏదో చెప్పాడు. ఫలితంగా అరగంటలో... ఆ వృద్ధుడు బయట పోర్టికో పక్కన గల మెట్లకింది గదిలోకి మార్చబడ్డాడు.

ఎప్పుడో... కొన్నేళ్లకింద... మెట్లకింద ఖాళీస్థలం కనపబడుతూంటే దేనికైన "స్టోర్‌రూం" గా పనికి వస్తుందని నిరంజన్ చెప్పినా వినకుండా అతడు కట్టించిన గదిలోకే... అతణ్ణి మార్చారు.

*** **** ****

**26 డిసెంబర్ 1999**

నిరంజన్ ప్రాజెక్టులన్నింటిలో గల కంప్యూటర్లన్నింటిని వై2కె యాక్షన్ ఫోర్స్ టేకప్ చేసింది. ఫోర్స్ చైర్మెన్ అహ్లూవాలియా నేతృత్వంలో... రేయింబవళ్లు వై2కెని ఒకే చేయడానికి... ప్రాజెక్ట్ రకాన్ని, కంపెనీ టర్నోవర్లనీ, కంప్యూటర్ల సంఖ్యని బట్టి నిపుణులు, ఇంజనీర్లు మైక్రోచిప్ సిస్టమ్ ని క్షుణ్ణంగా పరీక్షిస్తున్నారు.

అయినా నిరంజన్ మనసు మనసులో లేదు...

డిసెంబర్ ఎండింగ్ దగ్గరపడుతున్న కొద్దీ... టెన్షన్... టెన్షన్... వై2కె ఒకే కాకపోతే... లక్షలు... కోట్ల నష్టం. ముఖ్యంగా పరువు... దావాలు... కోర్టుకేసులు... ఈ ఆలోచనల్తోనే ఒక్కోరోజు ఇంటికేరాని పరిస్థితి ఎదురవుతోంది.

అందులోనూ... మరోరెండు రోజులైతే జనవరి ఒకటి. ఆరోజుగాని ఓ.కె. అయిందీ కానిదీ తెలీదు.

ఆరోజు రాత్రి నిరంజన్ ఇంటికొచ్చేసరికి రాత్రి రెండవుతోంది. వాచ్‌మెన్ కారుహారన్ విని... కళ్ళు నులుముకుంటూ వచ్చి గేటు తీసాడు. మైటీ తోక

వూపుకుంటూ ఎదురుగా వచ్చింది. పోర్టికోలో కారు పెట్టి లోపలికి వెళ్లబోతున్న నిరంజన్‌కి ఏదో మాటలా విన్పించి ఆగిపోయాడు.

మెట్లకింది గదిలోంచి మూలుగులు విన్పిస్తున్నాయి. తండ్రికెలావుందోనని ఆ గదివైపు నడిచాడు. బెడ్‌లైట్ వెలుగులో తోలుతొడిగిన అస్థిపంజరంలా పడుకున్నాడు.

"భగవంతుడా... నన్నిప్పుడే... తీస్కెళ్లకు... నన్ను బతికించు... నన్ను బతికించు.. భగవంతుడా... ఇప్పుడే తీస్కెళ్లకు..."

తండ్రి నిద్రలో పలవరిస్తున్నాడనుకుంటూనే... ఆ మాటలు విని బాధగా నవ్వుకున్నాడు. "జీవితం మీద తనకింకా మమకారం చచ్చిపోలేదు... బతికించమని భగవంతుణ్ణి ప్రార్థిస్తున్నాడు. పిచ్చినాన్నా..." తనలో తనే గొణుకుంటూ ఇంట్లోకి వెళ్లిన నిరంజన్ ఆశ్చర్యపోయాడు.

ఇద్దరు కొడుకులు, కూతురు అంత రాత్రికూడా మెలకువతో వుండి... ఇల్లంత డెకొరేట్ చేయటంలో మునిగిపోయారు. తండ్రిని చూడగానే "ఎలా వుంది డాడీ ?" అంది కూతురు.

"బావుంది. ఇదంతా ఎందుకురా?" అన్నాడు అలంకరించబడిన ఇల్లంతా చూస్తూ.

"డాడీ... ఇంకా రెండ్రోజుల్లో "కొత్త శతాబ్దం" రాబోతుంది. టూథౌజండ్‌కి గ్రాండ్‌గా వెల్‌కమ్ చెప్పాలని... డిసెంబర్ థర్టీఫస్ట్ మిడ్‌నైట్ నించీ జనవరి ఫస్ట్ అర్ధరాత్రి వరకూ... అంటే వన్‌డే ఫుల్‌గా మా ఫ్రెండ్సందరికీ 'వెల్‌కమ్ టూథౌజండ్' పార్టీ సెలబ్రేట్ చేయబోతున్నాం అన్నాడు చిన్నకొడుకు.

"అవును డాడీ... అందుకే ఇదంతా" అన్నాడు పెద్దకొడుకు, కూతురు. నిరంజన్ నవ్వుకొని తన బెడ్‌రూంలోకి వెళ్లిపోయాడు.

*** **** ****

**1 జనవరి 2000**

ప్రపంచమంతా కొత్త శతాబ్దానికి ద్వారాలు తెరిచింది.

కేలండర్ తలంటుపోసుకుంది. గ్రీటింగ్ కార్డులు రెక్కలు విప్పుకున్నాయి. అర్ధరాత్రి మద్యం పొంగులెత్తింది. వికల నృత్యాలు వీర తాండవమై విజృంభించాయి. ఏ నూతన సంవత్సరానికీ రానంత క్రేజ్ 'వెల్‌కమ్ 2000' కి వచ్చింది. ఆకాశంలో తారాజువ్వల తోరణాలతో కాలం పులకించిపోయింది. నిరంజన్ ఇంట్లోకూడా... మత్తుగా... చిత్తుగా... డ్రింక్ పార్టీలు, డాన్సులతో రోజంతా తాగి తాగి అలసిపోయి పడిపోయారు.

జనవరి రెండోతేది తెలతెలవారింది.

నిద్రలో వున్న నిరంజన్ ఉలిక్కిపడిలేచాడు. మైటీ (కుక్క) నిరంజన్ నైట్‌డ్రెస్‌ని నోటితో పట్టుకొని లాగుతూ బెడ్‌చుట్టూ తిరుగుతూ వుంది. నిద్రభంగం చేసినందుకు కసురుకున్నాడు. కానీ అది వదల్లేదు. తన నైట్ డ్రెస్‌ని పట్టి మళ్లీలాగింది. నిరంజన్ లేవగానే కుయ్... కుయ్... మంటూ కదిలింది. అనుమానంగా దానివెనకే నడిచాడు. అది మెట్లకింది గది దగ్గర ఆగిపోయింది.

ఎప్పుడు చచ్చిపోయాడో... తండ్రి శవంమీద ఈగలు వాలుతున్నాయి. నిరంజన్‌లో మత్తు దిగిపోయింది. నిర్వికారంగా, నిశ్చేష్టుడై

చూస్తుండిపోయాడు. కన్నీళ్ల చూపుల్ని అడ్డుకోగానే... 'మాళవిక... చంటీ... ఒరెయ్ లోహిత్... సలంద్రా...

తాతయ్య చనిపోయాడు..." బాధగా ఆవేదనగా అందర్నీ లేపాడు.

బద్ధకంగా ఒళ్లు విరుచుకుంటూ అంతా మెట్లకింది గది దగ్గరకు చేరుకోగానే నిరంజన్ బావురుమన్నాడు.

తను ఇంతగా ఎదగడానికి... తండ్రిపడ్డ కష్టాలు గుర్తొచ్చి... నిరంజన్ వెక్కివెక్కి ఏడుస్తున్నాడు.

నిశ్శబ్దంగా చూస్తున్న చిన్నన్నయ్యతో చెల్లెలు "ఒరేయ్ అన్నయ్య... కొంపతీసి, ముసలాడు నిన్న చస్తే... గుడ్‌మార్నింగ్ టూథౌజండ్ సెలబ్రేట్ డిసప్పాయింట్ అయ్యేది" అంది.

వాళ్ల ఆనందానికి తన చావు అడ్డు పడకూడదనే... ముందుకొస్తున్న మృత్యువుని సైతం ఒకరోజు వాయిదా ఇమ్మని ప్రార్థించిన వృద్ధుడి పెదాలమీద ఈగలు ఆ మాటవిని... జొబ్బ్ మని లేచిపోయాయి.

"అవున్రోయ్... కానీ రెండ్రోజుల ముందు పోతే 'టైమ్లీ' గా వుండేది. ఎందుకంటే నైంటీనైన్ అంతర్జాతీయ వృద్ధుల సంవత్సరం కదా..." అన్నాడు గుసగుసగా.

ఇంట్లోంచి అప్పుడే అక్కడికి ఇంకా దిగని మత్తులో వచ్చిన పెద్దకొడుకు... తండ్రి పక్కనే కూచుంటూ...

"డాడీ... మీకు యాక్షన్ ఫోర్స్ వాళ్లనించి ఫోనొచ్చింది. లైన్‌లో వున్నారు.

వై2కె రిజల్ట్ ఏదో చెప్తారట..." అన్నాడు మెల్లిగా...

శవం పక్కనించి... నిరంజన్ దబ్బున లేచాడు.

గుండె దడదడలాడింది... కళ్లు తుడుచుకున్నాడు.

కాళ్లు తడబడుతుంటే... వడివడిగా ఇంట్లోకి నడిచాడు.

ఆ గదిముందర.... కన్నీళ్లతో కూర్చున్న కుక్కపిల్ల.. అర్థంగాక అతడివైపే చూస్తుండిపోయింది.

జజజ జజజజ జజజజ

3, ఫిబ్రవరి 2000

నిరంజన్ తండ్రి 'నెల ఖర్మ' ని తనస్థాయిలో గ్రాండ్‌గా అరేంజ్ చేసాడు. తండ్రి ఫోటోకి గంధపు వాసనవి నిలువెత్తు పూలదండలేసాడు.

స్నేహితులు, బంధువులు, వర్కర్స్... వేలాదిమందికి తండ్రి ఆత్మశాంతి నిమిత్తం భోజనాలు సిద్ధం చేసాడు.

శృతి కంప్యూటర్స్ ఎం.డి. నిరంజన్‌తో "ఒరేయ్ నిరంజన్... ఇంతకి మీ తండ్రి ఎలా చనిపోయాడు?" అనడిగాడు.

ఆమాట విన్న నిరంజన్‌కి మనసులో కలుక్కుమంది.

'వై2కె... వై2కె...' అని చెప్పలేక తడబడుతుంటే... అక్కడికి వచ్చిన నిరంజన్ కూతురు "అంకుల్... మా తాతయ్య వై3కె వల్ల చనిపోయారు" అని జోక్ చేసింది.

"వ్వాట్... వై3కె... అంటే?" అతడు అయోమయంలో పడ్డాడు.

"మా బేబీ చెప్పింది కరెక్టేరా... నాన్న వై3కె తో చనిపోయారు. వై3కె అంటే... మానవ సంబంధాల్ని కొరికేస్తున్న వైరస్‌రా... వై2కె కంప్యూటర్లలో వచ్చిందేమో కాని... వై3కె ప్రతి కుటుంబంలో వచ్చేస్తోందిరా... నాన్న అలాగేపోయారు..."

ధుఃఖం కట్టలు తెంచుకుంటే... ఇంకెలా చెప్పాలో తెలీని నిరంజన్ అప్పుడు అతణ్ణి పట్టుకొని బావురుమని ఏడ్చాడు.

* * *